# మెరుపు మెరిసింది

పగలు తొమ్మిదిన్నర.

వర్షం! వర్షం!

దిక్కుమాలిన వర్షం.

వర్షంతో గాలి, చలి, తడి, బురద.

ఏకధారగా వర్షం.

వర్షపు బాధ.

ఉంటే అతివృష్టి. లేకపోతే అనావృష్టి.

ప్రస్తుతం అతివృష్టి బాధ.

గుమ్మంలో నిల్చుండి నీరజ, గొడుగు పట్టుకొని.

అద్దెగదులు రెండూ కురుస్తున్నాయి.

నేలంతా తడి.

ఆస్పత్రిలో పేషెంట్సుల గదంతా మాసినబట్టలు. మాసిన గోడలు.

పాతకేలండర్ల మీద బొమ్మలు:

మాస్టర్ విఠల్, జాల్ మర్చంట్, ఇ.బిల్. మోరియా; మాధురి, గోహర్, సులోచన - గోడలమీద వేళ్ళాడుతున్నారు.

ఆమె చదువుకొనేరోజుల్లో హీరోస్ ఎన్డ్ హీరోయిన్స్-

ప్రస్తుతం మాసినగోడలనుంచి నవ్వుతున్నారు.

వారి నవ్వువైపు చూడ్డంలేదు నీరజ.

వీధిలోకి చూస్తోంది నీరజ.

వర్షం, వర్షం.

దడదడమని వర్షం.

గొడుగు విప్పింది నీరజ. చిరిగింది గొడుగు అక్కడా అక్కడా.
వీధిలో అడుగు వేసింది. నీరజ.
పగలు తొమ్మిదిన్నర.
పదిగంటలకి స్కూలు.
రెండుమైళ్ళు వెళ్ళాలి బస్సులో.
పది నిమిషాలు నడవాలి బస్సు స్టాండుకి.
వెయిట్ చెయ్యాలి బస్సుకోసం.
ఎంతసేపో?
వెళ్ళాలి బస్సులో, తడిలో, చింకి గొడుగుతో.
అందరూ కంపుకొడుతూ, బోన్లో ఎలకల్లా చస్తూ.
ఇవాళ స్కూల్కి వెళ్ళడం ఎలాగూ ఆలస్యం అవుతుంది.
లేటుగా వెళ్తే మబ్బుతో ఆకాశం మూసుకుపోయినట్టు
మూసుకుపోతుంది హెడ్ మిస్ట్రెస్ ముఖం.
కానీ,
"వర్షం పడ్డానికి నేను కర్తనా?"
వర్షం పడుతోంది.
దిక్కుమాలిన వర్షం
1935లో చేరింది టీచర్గా,
ఇరవై సంవత్సరాల వయసులో,
ఇంటర్మీడియేటు పాసయేక.
అంతవరకే తన చదువు.
బియ్యేకి చదువుతామంటే,
ఇంటావంటా లేని డబ్బు
ఎదురుగా అడ్డొచ్చింది.
డబ్బు, డబ్బు.
జీవితాంతంవరకూ దానికోసం తాపత్రయపడ్డం
అది లేక బాధపడ్డం.
ఎన్నాళ్ళిలా గడపడం?

చచ్చేవరకూ ఇంతే కాబోలు!

1935లో పెట్టుకొన్న ఆశలన్నీ ఏవీ?

ఏవీ?

ఒక్కటి లేదే!

లవ్!

రొమాన్స్!

మేరేజ్!

మనీ!

ఒక్కటి లేదే!

ఆశలన్నీ మట్టిపాలయేయి.

నీళ్ళపాలయేయి.

నీళ్ళు. ఎక్కడ చూసినా నీళ్ళు.

కార్లు పోతోంటే బురదనీరు చీరమీదకి చిమ్ముతోంది.

తడిసిన చీర ఎలానూ తడిసింది.

కాని, ఈ తడిచీరమీద చలిబాధ మరీహెచ్చుగా ఉంది.

గుండెల్లోంచీ వణుకు పుట్టుకొస్తోంది.

"ముసల్దాన్నయి పోతున్నాను."

పదిహేనేళ్ళ క్రితం గాల్లో తేల్తూ స్కూలికి వెళ్ళింది.

అప్పుడు తనకి ఇరవయ్యేళ్లు.

ఇప్పుడు ముప్ఫయ్యయిదు.

*Niraja is thirty-five years old.*

*Old!!*

"ముసల్దాన్నయి పోతున్నాను."

ముప్ఫయ్యయిదు వర్షాల ప్రాయం నీరజది.

ముప్ఫయ్యయిదు వసంతాల ప్రాయం ఎదుక్కాకూడదు–నీరజది?

కాదు.

నీరజది వసంతాల ప్రాయం కాదు.

వర్షాల ప్రాయమే!

వర్షం, వర్షం.
జోరుగా, పక్కవాటుగా, పొడుస్తూ వర్షం.
పెళ్ళయితే తన పిల్లలు వెళ్ళవలసింది స్కూలికి.
పెళ్ళికాలేదు తనకి.
పెళ్ళయే ఆశలేదు.
వివాహయోగం లేని జాతకం.
ఒకప్పుడు పెళ్ళవుతుందని ఆశపడ్డది.
చాలాకాలం క్రితం.
ఇరవై సంవత్సరాల క్రితం.
పదిహేనేళ్ళ పడుచుపిల్ల
పద్దెనిమిదేళ్ళ పడుచుపిల్లడు
పక్కింటినుంచి చూపులు.
పక్కింటిమీదికి చూపులు.
ఉత్తరాలా?
కాదు.
ప్రేమలేఖలు.
పెరట్లో.
చీకట్లో.
కౌగలింతలు.
నిద్దర్లో కలలు.
అంతే.
ఎవరిదారి వారిది.
అటుతరువాత?
ఇంకే ఆశా లేదు.
నీరజకి పెళ్ళిచేయించే వృద్ధులూ లేరు,
నీరజని పెళ్ళాడ్డానికి యువకులూ లేరు.
తన వైపెవరూ చూడలేదు, చూడరు.
తనెవరికీ అక్కర్లేదు.

"నా గతి ఏంకాను?

ఇంతే, ఇలాగే, వర్షంలో, చలిలో, చింకి గొడుగుతో బడిపిల్లల పాఠాలు చెప్తూ, చెప్పలేకపోతూ -

ఆఖరికి చస్తే శవాన్ని మోసుకెళ్ళడానిక్కూడా ఎవరూ ఉండరు.

"ఛా! ఏమిటీ ఆలోచనలు?"

"అవికాక ఇంకేముంది?"

వర్షం వర్షం.

బస్సుస్టాండ్ దగ్గర.

సైన్‌పోస్టు తడుస్తోంది

ఎవరూ లేరు.

ఎవరుంటారు నీరజ తప్ప?

ఆ సైన్‌పోస్టూ, తనూ తప్ప ఇంకెవరూ ఈ వర్షంలో తడవరు.

ఎండ కెండి వానకి తడవ్వలసిందే.

బస్సు ఎంతకీ రాదు.

ఇవాళ ఎలాగూ ఆలస్యం అవుతుంది.

డబ్బుంటే....

డబ్బు రావడం ఎలా?

అయ్యో రాత, డబ్బు రాదు.

అయ్యోరాత, ఈ బస్సురాదు.

వస్తే ఆగకుండా పోతుంది, సీటుండదు.

*Niraja always misses the bus.*

అదిగో బస్సు దూరంగా.

బస్సులో నిల్చోవాలి.

ఏ మగాడూ లేచి తనకి సీటివ్వడు.

అందంగా ఉంటే ఇస్తారు.

నీరజకి అందం లేదు కాబోలు!

పై వాళ్ళకి తెలియాలి.

బస్సు తెగ జోరుగా వస్తోంది.

కారుని తప్పించుకుని వచ్చింది ముందుకు.

స్లోడౌన్ కాలేదు. రోడ్డు మధ్యగా వస్తోంది.

అయితే ఖాళీ లేదన్న మాటే?

వచ్చింది.

వెళ్ళిపోయింది, పిచికారీలా నీళ్ళు చిమ్ముతూ.

అనుకున్నట్టుగానే అయింది.

వెయిట్ చెయ్యాలి మరో బస్సు కోసం.

వెనకాతల కారు మెల్లిగా వస్తోంది.

నంబరు 123.

నిల్చోవాలి నీరజ ఒకటీ రెండూ మూడూ అని నిముషాలు లెక్కెడుతూ.

జీవితాంతంవరకూ అలా లెక్కపెడుతూ నిల్చోవలసిందే.

ఆగని బస్సుల కోసం,

దొరకని సౌఖ్యాల కోసం,

తీరని కోరికల్తో,

తీరని బాధలో.

ఈ జీవితం ఆఖరయేవరకూ ఇంతే.

వర్షం, వర్షం.

బస్సుస్టాండు దగ్గర కారు ఆగింది.

ఇక్కడెందు కాగింది.

"మీరెక్కడికి వెళ్తారో తెలుసుకోవచ్చా?"

స్టీరింగ్‌వీల్ దగ్గర కూర్చుని వంగి చూస్తూ అడిగాడు.

ఒక్కడే ఉన్నాడు కార్లో.

జుట్టు తగ్గుతోంది, నుదురు ఎదుగుతోంది. ఎర్రటి కళ్లు, నల్లటి ఫ్రేమ్ కళ్ళద్దాలు, మట్టిరంగు ఉన్ని కోటు, అదే రంగు నెక్ టై, నవ్వేముఖం, ఆరోగ్యమైన శరీరం, నలభై లోపు వయస్సు.

అన్నీ ఒక్క క్షణంలో కనిపెట్టింది. ఆరితేరిన కళ్ళతో.

"మిడిల్ స్కూల్కి వెళ్లాలండీ."

"దార్లోనే ఉంది. మీ కభ్యంతరం లేకపోతే కూర్చోండి"

తలుపు తీశాడు.

వర్షం, వర్షం.

కార్లో కూర్చుంది, థాంక్సు చెప్పింది.

"దానికేం లెండి, చంపేస్తుంది వర్షం."

సిగరెట్టు వాసన. ఖరీదైన సిగరెట్టు వాసన.

రుమాలు తీసి ముఖం తుడుచుకున్నాడు. ఖరీదైన సెంటువాసన.

చేతిని వాచీలో ఆరు నిమిషాలెక్కువ పది.

కారు కదిలింది.

నీరజ గుండె కదుల్తోంది జోరుగా.

కలవర పడుతోంది నీరజ.

చేతిలో ఉన్న గొడుగు వణుకుతోంది.

మాట్టాడ్డానికి ఏమీ తోచడం లేదు.

అతనే అడిగాడు.

"స్కూల్లో టీచర్‌గా ఉన్నారా?"

"అవునండీ"

అతని ముఖం నవ్వుతోంది.

"మిమ్మల్నెక్కడో చూసినట్టు జ్ఞాపకమండీ!"

ఆ మాటకి గుండె లెందుకో దడ దడ కొట్టుకున్నాయి,

రక్తం వెచ్చగా ప్రవహించింది.

పద్దెనిమిదేళ్ళ పడుచుపిల్ల డెందుకో స్ఫురణకొచ్చేడు.

ఈ వయసే ఉంటుంది.

ఎక్కడో చూసినట్టు జ్ఞాపకం!!

పిచ్చి ఊహ.

పద్దెనిమిదేళ్ళ పడుచుపిల్లడు ఆనాడే పోయేడు.

రాడు రాడు మళ్ళీ రాడు.

కథల్లోనే మళ్ళీ కన్పిస్తారు పోయిన నాయకులు.

ఆఖరిపేజీలో కనిపించడానికి ఇదేం నవల కాదు.

కాని, రక్తం జోరుగా ప్రవహిస్తోంది.

కారు జోరయింది. మలుపు దగ్గర కొచ్చింది.

మలుపు తిరిగింది జోరుగా.

ఊపుకి అతని ఎడం భుజంమీద వాలింది.

వెచ్చగా, వెచ్చగా.

వెచ్చటి సువాసన. మగజంతువు వాసన.

వాంఛ రేగింది. ఆశకలిగింది. సర్దుకొంది. సరిగా కూర్చొంది.

ముందుకి చూసేసరికి,

ఎదురుగా స్కూలు.

ఆగింది కారు.

"మెనీ థాంక్స్."

"నాటెటాల్."

"ఛీరియో."

"ఛీరియో."

అంతే.

పదిగంటలు సరిగా.

వర్షం వర్షం.

అమ్మయ్య! టైముకి వచ్చేను.

సంతసానికి ఇంతకి మించిన కారణాల్లేవు.

స్కూలుకి లేటుగా రాలేదు. క్లాసులో పిల్లలు అల్లరి చెయ్యలేదు.

ఇంటివాడు అద్దెకి పేచీ పెట్టలేదు. దుకాణంవాడు అరువు ఇవ్వడం మాన్లేదు.

ఇంతటి విషయాలే నీరజకి సంతృప్తి నిచ్చేవి.

నీరజా! నీరజా!

వర్షం, వర్షం.

కాని–

ఆ రాత్రి మనసు అకారణంగా తేలిగ్గా ఉంది.

వర్షం పడుతోంది. చూర్లోంచి నీరు దిగుతోంది. చలివేస్తోంది.

నీరజకి నిద్రరాదు.

రోజూ నైరాశ్యంవల్ల, దౌర్భాగ్యంవల్ల నిద్రరాదు.

కలిగిన ఆశవల్ల ఇవాళ నిద్రరాదు.
వర్షం వర్షం.
చలి, చలి.
ముణుచుకు పడుకుంటే మాత్రం వెచ్చగా తేలిగ్గా ఉంది.
మబ్బుల్లోంచి,
వర్షంలోంచి
తలుపుల్లేని కిటికీలోంచి,
చీకట్ని తోసేస్తూ,
మెరుపులు!
ఒకమెరుపు, ఒకటి; మరొక మెరుపు, రెండు; మరో మెరుపు, మూడు.
ఒకటీ, రెండూ, మూడూ.
వర్షంలో వాహనం.
వాహనంలో రసికుడు.
విత్తనం చిన్నదైనా మర్రిచెట్టు పెద్దదే.
"ఎక్కడో చూసినట్టు జ్ఞాపకం."
పద్దెనిమిదేళ్ళ పడుచు పిల్లడు.
అనుకోకుండా ఆరంభిస్తుంది వలపు.
మెరుపు, మెరుపు, మరో మెరుపు.
మనసులో మెరుస్తున్నాయి ఆశల మెరుపులు.
"ప్రళయకాల మహోగ్ర...మెరపేలా?"
ఏ(వి(ఁటి చెప్మా ఆ పాటా?
బాగా రాసేరెవరో.
ఎవరో ఆ కవి?
ఎక్కడున్నాడు-
పదెనిమిదేళ్ళ పడుచుపిల్లడు?
వయసిప్పుడు నలభయ్యేళ్ళ దగ్గరుండదూ?
ఒకటీ, రెండూ, మూడూ.
అతన్దీ అదే వయసు.

నవ్వుతూండే ముఖం,

అదేదో సువాసన,

వాలడానికి వీలయే భుజం.

"ఏవిఁటీ ఆలోచన్లు నాకు?"

అతనెవరో నే నెవరో,

మళ్ళీ కనిపిస్తాడా ఏమైనానా?

కనిపించడా?

మెరుపు

అదిగో మెరిసింది,కనిపిస్తాడు మళ్ళీ.

"నా గుండెలేనా కొట్టుకుంటున్నాయి?"

దడదడ ఒకటి...దడదడ రెండు దడదడ మూడు...

వర్షంలో తడుస్తోంది తను. బట్టలు తడిసి ముద్దయ్యాయి. కారు, రెక్కలకారు వచ్చి వాలింది. వర్షం ఎక్కడికి పోయింది? పరుపు ఎక్కణ్నుంచి వచ్చింది? పరుపు, మెత్తటి పరుపు. శాలువాలు. వెచ్చటి శాలువాలు. పువ్వులు, కమ్మని మల్లెపూలు.

వంటిమీద సాఫ్టుసారీ, చెంపలమీద వేడిచేతులు, పెదవులమీద వేడి పెదవులు. నున్నగా కమ్మగా వేడిగా...హెడ్‌మిస్ట్రెస్ ఏడుస్తోంది. ఈర్ష్యతో...ఏడవనీ...వెచ్చటి పెదవులు...చుట్టూ పిల్లలు...పాలబుగ్గల పసి పిల్లలు...కేరుతూ ఆడుతూ... రెక్కల...కారు...బ్యూటిఫుల్ టూసీటర్... మెరుపులు... ముద్దులు...సిగరెట్లు... సువాసన్లు.... సూక్కలు మీదకి మండే సిగరెట్టు ... మంటలు, మెరుపులు... చలిమంటలు...ప్రతి మంటదగ్గరా వెచ్చగా కూర్చొని అతను, తను...వెచ్చగా హాయిగా...

ఆ మర్నాడు-

నీరజ నిద్ర లేచింది.

వర్షం వెలియలేదు.

నష్టమేం లేదు.

బద్ధకం, తెగబద్ధకం.

అమ్మో!ఎనిమిదయింది.

గబగబా, గబగబా.

ఎందుకీ ఉత్సాహం?

ఏవిటా ఆశ?

"ఛా, నాకే ఆశా లేదు."

అయితే అకారణంగా ఎందుకీ సంతోషం?

కారణం ఉంది.

ఒకటీ, రెండూ, మూడు.

అది కారణం.

నిజంగా అదే కారణం.

అబ్బే కాదు, మనస్సు వప్పుకోదు.

కాని అదే అదే, నిజంగా అదే.

వర్షం వర్షం.

పడాలి, ఇంకా పడాలి.

గబగబా తయారయింది, తొమ్మిదిన్నరకల్లా.

సరిగ్గా బయల్దేరింది తొమ్మిదిన్నరకే.

నిన్నకూడా ఇదేవేళ.

నిన్నకూడా ఇదే వర్షం.

వర్షం వర్షం.

నిన్నా వర్షం.

ఇవాళా వర్షం,

బస్సుస్టాండుదగ్గర నీరజే ఉంటుంది. మరెవరూ ఉండరు. బస్సురాదు. వచ్చినా సీటుండదు.

ఒకటీ, రెండూ, మూడూ,

"...అభ్యంతరం లేకపోతే..."

వెచ్చటి స్పర్శ. తియ్యటి వాసన.

ధబ్ ధబ్, ధబ్ ధబ్.

కొట్టుకుంటున్నాయి గుండెలు.

నడుస్తోంది నీరజ జోరుగా, తేలిగ్గా.

పదిహేను సంవత్సరాల క్రితం.

టీచర్‌గా చేరిన తొలిరోజుల్లో

ఇలాగే తేలిగ్గా వెళ్లింది.

నిజంగా పదిహేనేళ్ళయిందా?
ఆశ్చర్యం! నిన్నకాకమొన్న జరిగినట్టుంది.
"నాలో ఏ మార్పూ లేదే."
ఇంకా తేలిగ్గా, ఇంకా జోరుగా.
వర్షం వర్షం.
నీరు తుళ్ళుతోంది వెనకన.
కారుచిమ్ముతోంది నీరు.
చూసింది చటుక్కున.
ఒకటీ, రెండూ, మూడూ!
కాని, అయ్యో.
ఆగకుండా పోతోందే!
చూడకుండా పోతున్నాడే!
నిజంగా చూడకుండా పోతున్నాడా?
అబ్బే, చూసే దాటేస్తున్నాడు.
ఆమె ఆడది, ఆమె తెలుసుకోగల్దు.
చూడనట్టు నటించి వెళ్ళిపోయేడు.
వెళ్ళిపోతున్నాడు.
అదిగో, అయ్యో బస్‌స్టాండ్.
ఆగింది కారు.
ఎక్కుతున్నారు కార్లోకి ఇద్దరు.
ఇద్దరూ ఆడవాళ్ళు;
తొణికిస లాడుతున్నారు యవ్వనంతో.
కిలకిల లాడుతున్నారు ఆనందంతో;
జిలజిల లాడుతున్నారు కాంక్షలతో.
సాగిపోయింది వాళ్ళతో.
మగవాడి వాసనతో
నిండిన మోటారు కారు.
ధబ ధబా దబ ధబా కొట్టుకుంటోంది గుండె.

అకారణంగా ఈర్ష్య, అకారణంగా నిరాశ.
ఆశించమని ఎవరన్నారు?
ఈ వయసులోనా నా కిటువంటి ఆశలు?!
ఆశలూ వద్దు, నిరాశలూ ంతకంటే వద్దు,
బాధలు వద్దే వద్దు.
అయినా బాధ.
వర్షం, వర్షం. దిక్కుమాలిన వర్షం.
బస్సు స్టాండు.
బస్సు వచ్చింది, సీటు వుంది.
"బ్రతుకు జీవుడా!"
వర్షం వర్షం.
పగలల్లా వర్షం.
రాత్రయింది.
ఇంకా వర్షం.
నీరజకి నిద్రరాదు.
ముప్ఫయ్యయిదేళ్ళ జీవితం.
వ్యర్థం వ్యర్థం.
జీవితమంతా వ్యర్థం.
మెరుపులు, మెరుపులు,
వ్యర్థం వ్యర్థం.
నేనూ, స్కూలూ, స్టూడెంటూస్.
వ్యర్థం.
వాళ్ళకి నేర్చుకుందామనే ఉత్సాహం లేదు.
నాకు నేర్పుదామనే ఆసక్తి లేదు.
శక్తిలేదు, ఆరోగ్యం లేదు ఓపిక లేదు.
ఇల్లు లేదు, తిండిలేదు, బట్టలేదు, భర్తలేదు.
యవ్వనం లేదు.
అలనాటి యవ్వనం అప్పుడే పోయింది.

అలనాటి చెలికాడు ఆనాడే పోయేడు.
అదంతే.
ఇదింతే.
అదో మెరుపు, ఇదో మెరుపు, మరో మెరుపు.
ఒకటే, రెండూ, మూడూ.
హాస్యాస్పదం నవ్విపోతారు.
మెరుపులు మెరుపులు ఆశల మెరుపులు.
అదిగో మెరుపు,
ఇదే మాయమయింది.
మళ్ళీ మెరిసింది,
మాయమయింది.
ఇంతే ఇదే.
ఆఖరి కిదే నిజం.
ఈ చీకటే ఇదే ఈ చీకటే నిజం.
ఇలా ఉండవలసిందే తను,
ఏకాకిగా, నిరాశతో...
నీరజ స్కూలికి వెళ్తుంది.
నీరజ స్కూలునుంచి వస్తుంది.
వయసు వెళ్తుంది.
చావు వస్తుంది.
అదిగో మెరుపు మెరిసింది.
అప్పుడే మాయమయింది.
ఆఖరి కింతే.

ఈ అంధకారంలో ఇలా వంటరిగా, నిరాశతో, దారిద్ర్యంతో, బాధతో, వర్షంలో చలితో, తడితో, చింకిగొడుగుతో, వంటరిగా... వంటరిగా... వంట... రిగా... వం... ట... రి...గా...

మెరుపు మెరిసింది.
మాయమయింది.

భారతి, జనవరి, 1951.